www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
కర్నూలు, నంద్యాల జిల్లా
వైయస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లా

# ప్రజల సంక్షేమాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**ప్రజల వద్దకు ప్రభుత్వం ప్రతి ఇంటికి సంక్షేమం**


**టిడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి**



**వేంపల్లె,జూలై27.అక్షరటైమ్స్:-** ప్రజల సంక్షేమం,అభివృద్ధే టిడిపి కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని టిడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పట్టణంలో నిర్వహించిన 'ప్రజల వద్దకు ప్రభుత్వం ప్రతి ఇంటికి సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రజా పాలన అందిస్తోందన్నారు. నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి బీటెక్ రవి ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, వారి స్పందనే మంచి పాలనకు నిదర్శనమని టిడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నేత మహమ్మద్ షబ్బీర్, టిడిపి పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, టౌన్ క్లస్టర్ ఇంచార్జ్ మహమ్మద్, నాయకులు తెలంగాణ వలి, పి.వి. రమణ, తిప్పారెడ్డి, మోహన్ రెడ్డి, కటిక నాగరాజు, జబిబుల్లా, డక్కా రమేష్, మాబుషరీఫ్, తక్కెల షరీఫ్, పీరా సాహెబ్, యాసిన్, పూల అల్లాబకష్, రామచంద్ర, గండికోట శివ, ఇస్మాయిల్, మదార్ తదితరులు పాల్గొన్నారు.

# బద్వేల్ లో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం

**పాల్గొన్న టిడిపి ఇన్చార్జ్ సూర్యనారాయణ రెడ్డి**





**బద్వేల్,జులై27.అక్షరటైమ్స్:-** బద్వేలు నియోజకవర్గం బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని సోమవారం 5,17 వ వార్డుల్లో రెండేళ్ల కూటమి పాలనపై అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా నిర్వహించిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచి, ప్రజలతో నేరుగా మాట్లాడి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. అలాగే స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చుతోందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,మంత్రివర్యులు నారా లోకేష్ లు దేశవ్యాప్తంగా పెట్టుబడులు ఆకర్షిస్తున్నారని పేర్కొన్నారు.దేశంలో ఎక్కడా లేనటువంటి సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని, సూపర్ సిక్స్ హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని తెలిపారు.తల్లికి వందనం పథకం ద్వారా ఒక కుటుంబంలో పిల్లలు ఎంతమంది ఉన్నా అందజేస్తున్నామని తెలిపారు.అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు, మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి రైతు కుటుంబానికి కేంద్ర సహాయంతో కలిపి ఏడాదికి రూ.20,000 అందిస్తున్నామని చెప్పారు.అదేవిధంగా తల్లికి వందనం, దీపం పథకం, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, అన్నా కాంటీన్ల పునరుద్ధరణ, యువతకు ఉద్యోగాల కల్పన వంటి హామీలను అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయనకు స్థానిక వార్డు ప్రజలు,నాయకులు మేళా తాళాలతో ఘన స్వాగతం పలికి, శాలువా, గజమాలలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, క్లస్టర్, యూనిట్ మరియు బూత్ కన్వీనర్లు, అలాగే మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# పెనగలూరు మండలంలో 6.5 కిలోల గంజాయి స్వాధీనం ముగ్గురు అరెస్ట్



**పెనగలూరు,జూలై27.అక్షరటైమ్స్:-** మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసుల కట్టుదిట్టమైన చర్యలు యువత భవిష్యత్తును రక్షించడం, కుటుంబాలను మాదకద్రవ్యాల దుష్ప్రభావాల నుండి కాపాడడం మరియు ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం తిరుపతి జిల్లా పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తోంది. జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ ఆదేశాల మేరకు, అదనపు ఎస్పీ శ్రీ ఆర్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో మరియు రేణిగుంట డీఎస్పీ శ్రీ వై. శ్రీనివాసరావు పర్యవేక్షణలో రేణిగుంట సబ్-డివిజన్ వ్యాప్తంగా గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వలు మరియు విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. ఈ క్రమంలో, పెనగలూరు మండల పరిధిలోని బెస్తపల్లి గ్రామ సమీపంలో విశ్వసనీయ సమాచారం ఆధారంగా నిర్వహించిన ప్రత్యేక తనిఖీలలో గంజాయి అక్రమ రవాణా మరియు విక్రయాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను కోడూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ డి. శ్రీనివాసులు, పెనగలూరు ఎస్ఐ శ్రీ అరుణ్ కుమార్ రెడ్డి మరియు పోలీసు సిబ్బంది అరెస్ట్ చేశారు. ఈ ఆపరేషన్‌లో నిందితుల వద్ద నుండి 6.5 కిలోల గంజాయి, ఒక టాటా సుమో వాహనం మరియు మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

**అరెస్ట్ చేయబడిన నిందితులు**

కంచర్ల సుబ్బారెడ్డి 71, చక్రంపేట గ్రామం, పెనగలూరు మండలం. తోడేటి శేఖర్ బుజ్జి 50, బోయినపల్లి గ్రామం, రాజంపేట మండలం. వడివేలు శీలంబర్సన్, అజయ్ 37 సెనగతకులం, వడమధురై పోస్ట్, తిరువళ్లూరు జిల్లా, తమిళనాడు.పరారీలో ఉన్న నిందితుడు సుబ్బారాయుడు, నల్లతిమ్మయ్యగారిపల్లి, నందలూరు మండలం.ప్రాథమిక విచారణలో నిందితులు గంజాయిని సేకరించి పరిసర గ్రామాలు మరియు ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు వెల్లడైంది. విచారణలో భాగంగా గంజాయి సరఫరా వ్యవస్థకు సంబంధించిన మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఈ అక్రమ వ్యాపారం వెనుక ఉన్న వ్యక్తులు, సరఫరా మార్గాలు మరియు సంబంధిత నెట్‌వర్క్‌ను పూర్తిగా వెలికితీసేందుకు పోలీసులు లోతైన దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుడిని త్వరలోనే అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక బృందాలు చర్యలు చేపట్టాయి.ఈ సందర్భంగా జిల్లా పోలీసులు మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు వ్యక్తుల ఆరోగ్యాన్నే కాకుండా కుటుంబాల ప్రశాంతతను, యువత భవిష్యత్తును మరియు సమాజ భద్రతను కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తాయని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల వ్యసనం కారణంగా అనేక కుటుంబాలు ఆర్థిక, సామాజిక మరియు మానసిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ఈ సమస్యను అరికట్టడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని తెలిపారు.తల్లిదండ్రులు తమ పిల్లల స్నేహితులు, అలవాట్లు మరియు రోజువారీ కార్యకలాపాలపై శ్రద్ధ వహించాలని, ఉపాధ్యాయులు మరియు సమాజ పెద్దలు యువతలో అవగాహన కల్పించాలని సూచించారు. యువత తమ లక్ష్యాలు, విద్య, ఉపాధి మరియు వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించి మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని కోరారు. మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకం. గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వ లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు.మాదకద్రవ్యాలకు 'నో' చెప్పండి ఆరోగ్యకరమైన కుటుంబాన్ని, సురక్షితమైన సమాజాన్ని నిర్మిద్దాం. యువతను కాపాడటం అంటే భవిష్యత్తును కాపాడటమే.

# వాల్మీకి బోయలకు 'భీమా' కుటుంబమే భరోసా

**బాలనాగిరెడ్డికి అఖండ మెజారిటీనే మా లక్ష్యం..**

**ప్రజల దగ్గరికి వచ్చినవారే అధికారానికి చేరువ**

**భీమా కుటుంబం సేవతో సంపాదించిన శక్తి**

**మంత్రి పదవే తదుపరి అడుగు**

**సేవే రాజకీయమైతే గెలుపు కేవలం ఫలితం మాత్రమే.!**




**మంత్రాలయం,జూలై27.అక్షరటైమ్స్:** మంత్రాలయం నియోజకవర్గంలో వాల్మీకి బోయల మద్దతు ఒకే కుటుంబంపై కేంద్రీకృతం కావడం, భవిష్యత్తు ఎన్నికల్లో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. సామాజిక వర్గాల భావోద్వేగ అనుబంధం, సేవా కార్యక్రమాల ప్రభావం, వ్యక్తిగత నమ్మకం అంత కలిసి భీమా కుటుంబాన్ని స్థానిక రాజకీయాల్లో బలమైన శక్తిగా నిలబెడుతున్నతల సంకేతాలు కనిపిస్తున్నాయి. అయితే మంత్రాలయం నియోజకవర్గ రాజకీయాల్లో వాల్మీకి బోయ సామాజిక వర్గం కీలకంగా మారుతున్న నేపథ్యంలో, భీమా కుటుంబంపై వారి విశ్వాసం మరోసారి స్పష్టమైంది. చిన్న కడబూరు గ్రామానికి చెందిన బోయ లక్ష్మణ చేసిన వ్యాఖ్యలు, స్థానిక రాజకీయ సమీకరణాలపై కొత్త చర్చలకు దారితీస్తున్నాయి. సోమవారం నాడు చిన్న కడబూరు గ్రామంలో స్తానిక వైసీపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి నాయకత్వంలో భీమా కుటుంబం వాల్మీకి బోయలకు అందిస్తున్న అండదండలు కేవలం రాజకీయ సహకారం కాదని, అది ఆత్మీయ బంధంగా మారిందని వివరించారు. మాకు వారు నాయకులు కాదని కుటుంబ సభ్యులు అనే వ్యాఖ్యలు అనుబంధానికి ప్రతిబింబంగా నిలిచాయి. అంతే కాకుండా నియోజకవర్గంలో ఏ బోయ కుటుంబానికి కష్టం వచ్చినా ముందుండి సహాయం చేసే కుటుంబం భీమాదే. ఆర్థిక, సామాజిక, వ్యక్తిగత సమస్యల సమయంలో చూపుతున్న స్పందన, వారిలో భరోసా నింపుతోందని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో "అడిగిందే తడవుగా సాయం" అనే మాట స్థానికంగా ప్రచారంలోకి వచ్చింది. అలాగే "మాకు ఏ పార్టీ అవసరం లేదు భీమా కుటుంబమే చాలని లక్ష్మణ స్పష్టం చేయడం,సంప్రదాయ రాజకీయ విధానాలకు భిన్నంగా ఉంది. వ్యక్తి ఆధారిత మద్దతు ఎలా పెరుగుతోందో దీనితో అర్థమవుతోంది. అదేవిధంగా రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించడం, తద్వారా ఆయనను రాష్ట్ర మంత్రివర్గంలో చూడడమే తమ లక్ష్యమని బోయ వాల్మీకులు ప్రకటించడం గమనార్హం. ఈ ప్రకటన, నియోజకవర్గంలో ఎన్నికల దిశను ప్రభావితం చేసే అవకాశం ఎంతయినా ఉంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, పెద్దాయన సీతారామ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్ రెడ్డి, యువ నాయకుడు ధరణిధర్ రెడ్డి లకు వాల్మీకి బోయల తరపున ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# 30 ఎం.ఎల్.డి తాగునీటి శుద్ధీకరణ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్ , జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా

**పట్టణ ప్రజలకు నాణ్యమైన తాగునీరు**

**అందించడమే ప్రభుత్వ లక్ష్యం**

**ప్లాంట్ నిర్వహణ, శుద్ధీకరణ ప్రక్రియలను**

**నిశితంగా పరిశీలించిన మంత్రి,కలెక్టర్**





**నంద్యాల,జులై27.అక్షరటైమ్స్:-** నంద్యాల పట్టణ ప్రజల ఆరోగ్య భద్రత, నాణ్యమైన తాగునీటి సరఫరాపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని . ఇందులో భాగంగా సోమవారం నంద్యాల మహానంది రోడ్డులో గల అమృత్ పథకం కింద నిర్మించిన 30 ఎం.ఎల్.డి తాగునీటి శుద్ధీకరణ కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖా మంత్రి ఎన్ఎండి ఫరూక్ , నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ ఆకస్మిక తనిఖీలో భాగంగా మంత్రి మరియు కలెక్టర్ ప్లాంట్‌లోని ప్రతి విభాగాన్ని నిశితంగా పరిశీలించారు. నీటి శుద్ధీకరణ (ఫిల్ట్రేషన్) ప్రక్రియ జరుగుతున్న తీరును, క్లోరినేషన్ విధానాన్ని మరియు ప్లాంట్ నిర్వహణ రిజిస్టర్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పట్టణ ప్రజలకు సరఫరా అవుతున్న తాగునీరు పూర్తిగా స్వచ్ఛంగా, సురక్షితంగా ఉండేలా ప్రతిరోజూ ల్యాబ్ పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. శుద్ధీకరణ కేంద్రం ప్రాంగణంతో పాటు నీటి నిల్వ ట్యాంకులను నిరంతరం శుభ్రంగా ఉంచాలని, ఎక్కడా కాలుష్యానికి తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలం దృష్ట్యా తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రజల నుండి వచ్చే నీటి సమస్యల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని, తాగునీటి సరఫరా విషయంలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని హెచ్చరించారు. నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఎమ్మార్వో శ్రీనివాసులు, గుర్రప్ప, ప్రజారోగ్య మరియు పురపాలక సాంకేతిక శాఖ అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# భారతరత్న అబ్దుల్ కలాం జీవితం ఆదర్శం

**ఏపీసీసీ మీడియా చైర్మన్ డా" ఎన్.తులసి రెడ్డి**



**వేంపల్లె,జూలై27.అక్షరటైమ్స్:-** భారతరత్న, మాజీ రాష్ట్రపతి ఏపిజె అబ్దుల్ కలాం జీవితం ఆదర్శణీయం అని ఏపీసీసీ మీడియా చైర్మన్ డా. ఎన్. తులసి రెడ్డి అన్నారు. సోమవారం అబ్దుల్ కలాం వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం తులసి రెడ్డి మాట్లాడుతూ కలలు కనండి, సాకారం చేసుకోండి అని అబ్దుల్ కలాం సందేశం యువతకు తారక మంత్రంలా పని చేసిందన్నారు. కలాం ఒక నిత్య విద్యార్థి అని, ఐక్యరాజ్య సమితి ఆయన జయంతి అక్టోబర్ 15న ప్రపంచ విద్యార్థి దినోత్సవంగా ప్రకటించిందన్నారు. స్వీయ ప్రతిభతో సామాన్యుడు, అసామాన్యుడు కాగలడని, ఒక పేపర్ బాయ్ శాస్త్రవేత్త కాగలడని అబ్దుల్ కలాం నిరూపించారన్నారు. ఈ కార్యక్రమంలో తులసిరెడ్డి సతీమణి అలివేలమ్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, బద్రీనాథ్, రమణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# గర్భవతులు తినే ప్రతి మంచి ఆహారం నీ బిడ్డ భవిష్యత్తుకి పునాది


**ఆరోగ్యకరమైన తల్లి - ఆరోగ్యకరమైన బిడ్డ**






**దువ్వూరు,జూలై27.అక్షరటైమ్స్:-** స్త్రీ గర్భవతి గా నమోదు అయినప్పటి నుండి సుఖ ప్రసవం వరకు అన్ని రకాల ఆరోగ్య సేవలను అందిస్తూ జాగ్రత్తగా చూసుకోవాల్సిన అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఆశా అంగన్వాడీ ఆరోగ్య కార్యకర్తలు పై ఉందని డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ హేమలత అద్వర్యములో జిల్లా టాస్క్ ఫోర్స్ టీం సందర్శించిన సందర్బంగా జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్ శ్రీ ఏ రమేష్ రెడ్డి పేర్కొన్నారు. అన్ని రకాల జాగ్రత్త లు తీసుకొని రక్త హీనత లేకుండా చూడాలని సమన్వయం తో పని చేయాలని అందరూ కూడా లక్ష్యాలను సాధించాలని పేర్కొన్నారు. రికార్డు లను పరిశీలన చేసి సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలొ డి పీ యం యు నారాయణ యం ఐ యస్ రాజశేఖర్ యం. పి హె చ్ ఈ ఓ. యం. వి.వి.ప్రసాద్ సూపర్ వైజర్ రాఘవ ఆరోగ్య విస్తరణ అధికారి రాజగోపాల్ ఆరోగ్యపర్యవేక్షకులు, వీరాంజనేయులు, శివగంగ రాజు , సీ హె చ్ ఓ లు, కె.ఇలవర్షి, ఎం. పవిత్ర,వి. శ్రావణి, వై.శ్యామల ఆరోగ్యకార్యకర్తలు ఎం.రవి కుమార్ ఎన్. జనార్ధన రావు ఆరోగ్యకార్యకర్తలు జె. శివ కుమారి, డి. వనజ, ఆశా కార్యకర్తలు వై.లక్ష్మీ దేవి, జి.కుమారి, ఎస్ అరుణ ,ఎన్. సుభాషిణి అంగన్వాడీ టీచర్స్ లక్ష్మీ దేవి, గంగమ్మ,అనురాధ, గర్భవతులు బాలింతలు ప్రజలు పాల్గొన్నారు.

# 20 కుటుంబాలు టీడీపీ లో చేరిక



**బద్వేల్,జులై27,అక్షరటైమ్స్:-** చింతల చెరువు గ్రామానికి చెందిన బిజివేముల రమణారెడ్డి,గాజుల పల్లె చెంచిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం చింతలచెరువు పంచాయతీ చింతలచెరువు గ్రామం బీసీ కాలనీ నుంచి 20 కుటుంబాలు టీడీపీ ఇంచార్జి సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నుండి తెలుగుదేశం పార్టీలో చేరారు. చెన్నూరు ఇస్మాయిల్,గూడూరు కరీం, మస్తాన్,బ్రహ్మయ్య, నారాయణ, చిన్న బ్రహ్మయ్య, పీరయ్య, సిద్దయ్య, పెద్ద పీరయ్య,వెంకటసుబ్బయ్య తదితరులు పార్టీ లో చేరారు.

# సూర్యనారాయణ రెడ్డి కి ఘన స్వాగతం



**బద్వేల్,జులై27.అక్షరటైమ్స్:-** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా అధిష్టానం ఆదేశాల మేరకు బద్వేల్ టిడిపి ఇన్చార్జి మంచూరి సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి టిడిపి కార్యక్రమం ఐదవ వార్డు లోని ఎగువ బ్రాహ్మణ వీధి, దిగువ బ్రాహ్మణ వీధి, దూల్లవీధి లలో పర్యటించారు. బద్వేల్ టిడిపి సీనియర్ నాయకులు మాజీ మున్సిపాలిటీ అధ్యక్షులు డాక్టర్ కొంకుల రాంబాబు, కొంకుల రామకృష్ణ, శ్రీరాములు, రమణయ్య, రవికుమార్, ప్రశాంత్, గనుమంతు రాజేష్, వాకా వాసు గ్రామంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.సూర్యనారాయణ రెడ్డి కి గజమాల తో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి, బిజెపి, జనసేన నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నంద్యాల అంజుమన్ స్కాలర్షిప్స్ పంపిణీ ఆగస్టు 2వ తేదీ



**నంద్యాల,జులై27.అక్షరటైమ్స్:-** ప్రతి సంవత్సరం ఇస్తున్నట్లే ఈ సంవత్సరం నంద్యాల అంజుమన్ ఆధ్వర్యంలో పదవతరగతిలో ఉత్తీర్ణత సాధించిన ముస్లీం విద్యార్థిని విద్యార్థులకు ఆగస్టు 2 వ తేది ఆదివారం ఉదయం 09.30గం నుండి 1గం వరకు ఆర్టీసి బస్టాండ్ ఎదురుగా గల అంజుమన్ షాదిఖానాలో పంపిణి చేయనున్నట్లు అంజుమన్ అధ్యక్షులు నశ్యం అబ్దుల్ ఖుద్దూస్ తెలిపారు.ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న నంద్యాల వాసులు, 550 విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 3000/-నగదు చెక్కులు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. గమనిక: స్థలాభావం వల్ల విద్యర్థుల ద్విచక్ర వాహనాలకు షాదిఖానాలో అనుమతించబడవు. కావున వీలైనంతవరకం విద్యార్థులు వాహనాలు తీసుకొని రావద్దని, తెచ్చిన వాహాన పార్కింగ్ స్వయంగా చూసుకోవాలని చెప్పారు.

# ప్రజావినతుల స్వీకరణ

### సత్వర పరిష్కారానికి అవగాహన



**శిరివెళ్ల.జులై27,అక్షరటైమ్స్:-** మండల కేంద్రములోని తహసిల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రైతులు మరియు ఇతర రెవెన్యూ సమస్యల సంబంధించిన అర్జీలు స్థానికంగా ఇచ్చుకునే విధంగా విఆర్వోలు విఆర్ఏలు విలేజ్ సర్వేయర్లు ఇతర రెవెన్యూ సిబ్బంది ప్రోత్సహించాలని తహసిల్దార్ శ్రీ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని తాహసిల్దార్ కార్యాలయంలో సోమవారం వీఆర్వోలు సర్వేయర్లు ఇతర రెవెన్యూ సిబ్బందితో ప్రజా సమస్యల పరిష్కార వేదిక గురించి తాసిల్దార్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆర్ ఓ ఆర్, వెబ్ ల్యాండ్, రీ సర్వే , రెవెన్యూ సమస్యలపై అర్జీలు స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించి గడువులోగా పరిష్కార మార్గానికి అవగాహన కల్పిస్తూ తహసిల్దార్ ఐ. విజయ శ్రీ దిశ నిర్దేశం చేశారు. ప్రజల నుంచి స్వీకరించే అర్జీలను పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి వెరిఫికేషన్ పూర్తి చేసి పరిష్కరించడమే ధ్యేయంగా కృషి చేయాలని తాహసిల్దార్ పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ కే కుమార్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర కుమార్, మండల సర్వేయర్ చిన్న మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## సబ్ రిజిస్టర్ కార్యాలయాలలో పబ్లిక్ డేటా ఎంట్రీ సేవలు సులువుగా క్రయవిక్రయాలు



**శిరివెళ్ల. జులై 27,అక్షరటైమ్స్:-** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సబ్ రిజిస్టర్ కార్యాలయాలలో ప్రవేశపెట్టిన డిజిటల్ సేవల వలన ఆస్తుల క్రయవిక్రయాలు సులువుగా జరగతున్నాయని శిరివెళ్ల సబ్ రిజిస్టర్ బాల సుబ్రహ్మణ్యం తెలిపారు. మండల కేంద్రంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ దస్తావేజు లేఖరుల రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలకు (ఆర్ఎస్కే సెంటర్) వ్యతిరేకంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో కమిషనర్ మరియు ఇన్స్పెక్టర్ జనరల్ రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ తాడేపల్లి వారి ఆదేశాల మేరకు ప్రతి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పబ్లిక్ డేటా ఎంట్రీ ద్వారా సులువుగా క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్లు జరిగేలా డిజిటల్ సేవలను అందుబాటులో ఉంచామన్నారు ఈ నేపథ్యంలో ప్రజలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయములను సంప్రదించి పబ్లిక్ డేటా ఎంట్రీ (పి డి ఈ) ద్వారా దస్తావేజులను తయారు చేసుకుని యధావిధిగా రిజిస్ట్రేషన్ సేవలు పొందవలెనని పిలుపునిచ్చారు. ప్రజలు ఈ ఆన్లైన్ డిజిటల్ సేవల సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకొని తమ రిజిస్ట్రేషన్ పనులను పూర్తి చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఆన్లైన్లోనే దస్తావేజులు రాసి ఆన్లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ కార్యక్రమం పూర్తిచేసి ఆన్లైన్ ద్వారానే వెంటనే డాక్ మెంట్ లు ప్రింట్ ఇవ్వడం జరుగుతుందని సబ్ రిజిస్ట్రార్ బాల సుబ్రహ్మణ్యం తెలియజేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

### పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించినఆర్డీవో కె. అరుణ దేవి



**ఆదోని,జూలై27.అక్షరటైమ్స్:-** ప్రజల సమస్యలను పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కరించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆదోని రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) కె. అరుణ దేవి తెలిపారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్-పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతులను ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజలు భూ వివాదాలు, రెవెన్యూ సమస్యలు, పట్టాదారు పాస్‌బుక్స్, వారసత్వ మార్పులు, సామాజిక భద్రతా పింఛన్లు, సంక్షేమ పథకాల అమలు, ఇతర పరిపాలనా అంశాలకు సంబంధించిన అర్జీలను సమర్పించారు. ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించిన ఆర్డీవో, అర్జీదారుల సమస్యలను ఓపికగా విని సంబంధిత శాఖల అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ప్రతి ఫిర్యాదును నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పరిష్కరించి, అర్జీదారులు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ సేవలు సకాలంలో అందించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్ సమర్థవంతమైన వేదికగా ఉపయోగపడుతోందని, ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఆర్డీవో తెలిపారు. ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడంలో అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రతి వినతిని సానుకూల దృక్పథంతో పరిష్కరించాలని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆగస్టు 14వ తేదీన జరుగుతున్న ఐఎఫ్టియు జిల్లా 3వ మహాసభను జయప్రదం చేయండి

### పిడిఎసు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎండి.రఫీ

### ఐఎఫ్టియుజిల్లా నాయకులు పి.లాజరస్ పిలుపు



**నందికొట్కూరు,జులై27.అక్షరటైమ్స్:-** ఐఎఫ్టియు ఉమ్మడి కర్నూలు జిల్లా 3వ మహాసభను ఎమ్మిగనూరు లో శ్రీ మంజునాథ మెనీ ఫంక్షన్ హాల్, తేరు బజార్ తిక్కన్న ప్రాంగణం లో జరుగుతుందని ఐఎఫ్టియు, మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ నేడు నందికొట్కూరు పట్టణంలో ఐ ఎఫ్ టు యు జిల్లా మహాసభ కరపత్రాలు విడుదల చేయడం జరిగింది. కావున జిల్లాలోని అన్ని రంగాల కార్మికులు పాల్గొని ఆ సభను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పిడిఎసు రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎండి .రఫీ, ఐ ఎఫ్ టి యు జిల్లా నాయకులు పి. లాజరస్ మాట్లాడుతూ దేశ సంపదను సృష్టించే కార్మికుల హక్కులను కాలరాస్తూ, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్స్ కార్మిక వ్యతిరేకమైనవని, వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను ఈ కోడ్స్ యూటీ ద్వారా హరించే కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరుస్తూ, కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ విధానాలను ప్రోత్సహించడం వల్ల లక్షలాది మంది కార్మికులు ఉద్యోగ భద్రత కోల్పోతున్నారని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు లేకపోవడం, కనీస వేతన చట్టాలు అమలు కాకపోవడం, కార్మిక సంక్షేమ చట్టాలను యాజమాన్యాలు ఉల్లంఘిస్తున్నప్పటికీ ప్రభుత్వాలు చూసీ చూడనట్లు వ్యవహరించడం దురదృష్టకరమన్నారు. దేశవ్యాప్తంగా "సమాన పనికి సమాన వేతనం" సూత్రాన్ని అమలు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, పెన్షన్, సామాజిక భద్రతా పథకాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులపై జరుగుతున్న దోపిడీని అరికట్టేందుకు ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.కార్మికోద్యమాన్ని బలోపేతం చేసేందు, సమస్యలపై పోరాడేందు అవసరమైన నాయకత్వాన్ని రూపొందించుటకు . ఈ సభలకు కార్మికులు హాజరై జయప్రదం చేయాలని కార్మికలోకానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ నాయకులు నవీన్, షేక్,చాంద్ బాషా,రవి,వంశీ,వినయ్, తదితరులు పాల్గొన్నారు.

# బీసీ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆర్డీవో కె.అరుణ దేవి







### పారిశుద్ధ్యం, ఆహార నాణ్యత, విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

### ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు మరుగైన సౌకర్యాలే లక్ష్యం

**ఆదోని,జూలై27.అక్షరటైమ్స్:-** విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతి, భోజనం, విద్యా సౌకర్యాలు నాణ్యంగా అందుతున్నాయో లేదో ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ఆదోని రెవెన్యూ డివిజనల్ అధికారి కె. అరుణ దేవి సోమవారం ఆదోని పట్టణంలోని ప్రభుత్వ బీసీ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బీసీ బాలుర హాస్టల్, ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల హాస్టల్, తదితర వసతి గృహాలను సందర్శించి అక్కడి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. హాస్టళ్లలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, వంటశాల పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ, విద్యుత్, పడక గదుల పరిశుభ్రత, విద్యార్థుల హాజరు నమోదు, మెస్ నిర్వహణ, స్టాక్ రిజిస్టర్లు, హాజరు పట్టికలు, ఆరోగ్య రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, ఎదురవుతున్న సమస్యలు, అవసరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆర్డీవో అరుణ దేవి మాట్లాడుతూ... ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, హాస్టళ్లలో నివసించే ప్రతి విద్యార్థికి సురక్షితమైన, పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడం వార్డెన్ల ప్రధాన బాధ్యత అని తెలిపారు. హాస్టళ్లలో ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, మెనూ ప్రకారం పోషకాహారం అందించాలని, వంటశాలలు, భోజనశాలలు, మరుగుదొడ్లు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, భద్రత వంటి మౌలిక వసతులు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల హాజరు, చదువుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి విద్యార్థికి అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తనిఖీల సందర్భంగా గుర్తించిన చిన్నచిన్న లోపాలను వెంటనే సరిదిద్దాలని సంబంధిత వార్డెన్లు, అధికారులు ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా హాస్టళ్ల నిర్వహణలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, నాణ్యమైన విద్యా వాతావరణాన్ని అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వారు పేర్కొన్నారు.

# విద్యార్థుల పోరాట ఫలితమే కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా

### ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో సంబరాలు




**ఆళ్లగడ్డ.జులై27,అక్షరటైమ్స్:-** ధర్మేంద్ర ప్రధాన్‌ను రాజీనామా చేయించే వరకు నిరంతరంగా పోరాడిన ప్రతి విద్యార్థికి, యువతకు, ప్రజాస్వామ్య శక్తులకు జేజేలు తెలియజేసీ ఆళ్లగడ్డ పట్టణంలో కేక్ కట్ చేసి, చాక్లెట్ పంచి సంబరాలు చేసుకున్న ఎస్ ఫ్ ఐ ఆళ్లగడ్డ మండల్ ఇంచార్జ్ అధ్యక్షుడు మున్నా మరియు ఎస్ఎఫ్ఐ నాయకులు,అనంతరం వారు మాట్లాడుతూ, ఇది విద్యార్థుల ఐక్యత సాధించిన చారిత్రాత్మక విజయం. సంఘటిత విద్యార్థి శక్తి ముందు ఏ పాలకుడూ గొప్పవాడు కాదని ఈ పోరాటం మరోసారి నిరూపించింది. గత రెండు నెలలుగా కొనసాగిన విద్యార్థుల ఉద్యమం నరేంద్ర మోదీ ప్రభుత్వ అహంకార కోటను కదిలించింది. ఈ పోరాటంలో విద్యార్థులతో కలిసి నిలిచిన అన్ని ప్రజాస్వామ్య, ప్రగతిశీల విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తోంది. ముఖ్యంగా దేశవ్యాప్తంగా విద్యార్థి ఆగ్రహాన్ని శాంతియుతమైన, శక్తివంతమైన ప్రజాస్వామ్య ఉద్యమంగా మలచడంలో కీలక పాత్ర పోషించిన సీజెపి తో పాటు అన్ని ప్రగతిశీల విద్యార్థి సంఘాల నాయకత్వాన్ని అభినందిస్తోంది. ఈ విజయం కేవలం ఒక మంత్రి రాజీనామాతో ముగిసే విజయం కాదు. భారత విద్యా వ్యవస్థలో సమూల సంస్కరణల కోసం కొనసాగుతున్న పోరాటంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయి. భారత విద్యారంగాన్ని పట్టిపీడిస్తున్న వ్యవస్థాగత సంక్షోభం పూర్తిగా తొలగే వరకు మా పోరాటం వివిధ రూపాల్లో కొనసాగుతుంది. 20 మందికి పైగా విద్యార్థుల ప్రాణాలు బలిగొన్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)ను వెంటనే రద్దు చేయాలి. విద్యార్థి వ్యతిరేక విధానాలకు చట్టబద్ధత కల్పిస్తున్న జాతీయ విద్యా విధానం (NEP)-2020ను ఉపసంహరించుకోవాలి. పరీక్షల అక్రమాలు, వైఫల్యాల వల్ల నష్టపోయిన విద్యార్థులకు, వారి కుటుంబాలకు సంపూర్ణ న్యాయం జరగాలి. దేశంలోని ప్రతి విద్యార్థికి సమానమైన, న్యాయబద్ధమైన, సమగ్ర విద్య అందే వరకు మా ప్రతిఘటన ఆగదు. నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా మొదటిసారిగా ఉద్యమాన్ని ప్రారంభించిన సంఘాల్లో ఎస్ ఫ్ ఐ ఒకటి. గత ఐదేళ్లకు పైగా చీఇూ-2020కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరంతర పోరాటం చేస్తోంది. గత రెండు నెలలుగా నీట్ ప్రశ్నాపత్రం లీక్, చీఇూ వైఫల్యాలు, శాంతియుత నిరసనలపై ప్రభుత్వ నిర్బంధ చర్యలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విద్యార్థులను సమీకరిస్తూ ఉద్యమాన్ని ముందుండి నడిపించింది. రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా విద్యార్థులను మరింత విస్తృతంగా సమీకరించి, మా డిమాండ్ల సాధన కోసం మరింత ఉధృతమైన ఉద్యమాలను చేపడతాం. ఈ పోరాటంలో తరాల మధ్య ఉన్న అంతరాలను చెరిపేస్తూ విద్యార్థులు, యువత, ప్రజలు చూపిన ఐక్యత, అంకితభావం, ధైర్యసాహసాలకు ఎస్ఎఫ్ఐ హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తోంది.

## ఆదోని అధికారుల కు జీవీఏ, జీడీడీపీ,జీసీడీపీ, జీఎండీపీ, అంశాలపై సామర్థ్య వృద్ధి శిక్షణ

### స్వర్ణాంధ్ర ఏ2047 లక్ష్యసాధనకు డేటా ఆధారిత అభివృద్ధి ప్రణాళికలపై అవగాహన కల్పించిన: కె. అరుణ దేవి



**ఆదోని,జూలై27.అక్షరటైమ్స్:-** ఆదోని నియోజకవర్గం అధికారుల కోసం జీ వీఏ, జీడీడీపీ,జీసిడిపి,జీఎంపీడీ సామర్థ్య వృద్ధి శిక్షణ కార్యక్రమంక విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ప్రత్యేక అధికారి మరియు ఆదోని ఆర్డీఓ అరుణాదేవి ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల సమర్థవంతమైన అమలులో శాఖల మధ్య సమన్వయం, "స్వర్ణాంధ్ర ఏ 2047" లక్ష్యాల సాధన, డేటా ఆధారిత ప్రణాళికలు, సమర్థవంతమైన పర్యవేక్షణ ఎంతో కీలకమని పేర్కొన్నారు. ,జీవిఎ, జీడి డిపి,జీసిడిపి,జీ ఎమ్ డి పి,ద్వారా సేకరించే సమాచారం గ్రామాలు మరియు పట్టణాల సమగ్ర అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. పహల్ ఇండియా ఫౌండేషన్ నిపుణులు ఈ శిక్షణలో వనరుల వ్యక్తులుగా పాల్గొని జీవిఎ, జీడి డి పి,జీ సి డి పి,జీ ఎమ్ డి పి లక్ష్యాలు అమలు విధానం, అభివృద్ధి సూచికలు, డేటా సేకరణ ప్రక్రియ, సమీక్షా విధానం, శాఖల మధ్య సమన్వయం వంటి అంశాలపై అధికారులకు సమగ్ర అవగాహన కల్పించారు. గ్రామాలు మరియు పట్టణాల సమగ్ర అభివృద్ధికి శాస్త్రీయ, డేటా ఆధారిత ప్రణాళికలను రూపొందించడంతో పాటు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి అవసరమైన నైపుణ్యాలను అధికారుల్లో పెంపొందించడం ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి మరియు ఆర్డిఓ కె. అరుణ దేవి ఆదోని నియోజకవర్గంలోని మండల ప్రత్యేక అధికారీ రాధిక , ఎమ్ పి డి ఓ, నాగరాజ స్వామి,ఎమ్ ఆర్ ఓ శేషపాణి , అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, పెహలే ఇండియా ఫౌండేషన్ శిక్షణ బృందం సభ్యులు మరియు ఆదోని సీవీఏపీ యూనిట్ సభ్యులు తదితరులుపాల్గొన్నారు.

## నారా లోకేష్ రాకకు ఆదోని ముస్తాబ్ ఇంటింటి టిడిపి ప్రచారంతో ప్రజల్లోకి కూటమి ప్రభుత్వం





**ఆదోని,జూలై27.అక్షరటైమ్స్:-** తెలుగుదేశం పార్టీ అధిష్టానం మేరకు ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమా ప్రారంభించారు, ఆదోని నియోజకవర్గంలో రాష్ట్ర కురుబ కురుమ కార్పోరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, అబ్జర్వర్ కేశవరెడ్డి , సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు , శ్రీకాంత్ రెడ్డి , ఉమ్మి సలీం,క్లస్టర్ ఇన్చార్జిలు, మరియు టిడిపి కార్యకర్తలు కలిసికట్టుగా ఆదోని పట్టణం నందు ఇంటింటి, టిడిపి ప్రభుత్వ సంక్షేమ పథకాల కార్యక్రమం నిర్వహించినారు. ప్రతి ఇంటి గడపకు వెళ్లి ప్రభుత్వ పనితీరును అడిగి తెలుసుకున్నారు, ప్రతి ఇంటి మహిళలు సంతోషం వ్యక్తం చేసినారు, చంద్రబాబు నాయుడు మా కష్టాలను తీరుస్తున్నారు కొనియాడారు, అన్నదాత సుఖీభవ,తల్లికి వందనం, సంవత్సరానికి మూడు సిలిండర్లు, ప్రతినెల ఇంటి దగ్గరే పించెను వస్తుంది ఇలాంటి మహానుభావుడు వందేళ్లు జీవించాలని చంద్రబాబు నాయుడు ను కొనియాడారు.నారా లోకేష్ మెగా డీఎస్సీ నిర్వహించినారు అందులో నా కొడుకు నా కూతురు ఉద్యోగం తెచ్చుకున్నారు మా కష్టాలన్నీ గట్టెక్కినావని . నారా లోకేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 29 నారా లోకేష్ ఆదోని పట్టణానికి రావడంతో ఆదోనిలో శరవేగంగా పనులు ముస్తాబవుతున్నవి ఈ కార్యక్రమంలో ఉమాపతి నాయుడు సిద్ధార్థ నాయుడు హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్ రామకృష్ణ, శ్రీకాంత్ రెడ్డి,బూత్ కన్వీనర్లు,ఇన్చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం : ఎం.షేక్‌హమ్మద్



**ఆదోని, జూలై 27. అక్షరటైమ్స్:-** ఆదోని మండలం పెద్ద తుంబళం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ శాసనసభ్యులు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి మీనాక్షి నాయుడు, ఉమాపతి నాయుడు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎం షేక్ అహ్మద్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సమీక్షేమ పథకాల ప్రయోజనాలను ప్రతి కుటుంబానికి చేరవేయాలనే లక్ష్యంతో ఇంటింటికి వెళ్లి ప్రజలకు పూర్తి వివరాలు తెలియజేస్తున్నాం ని వారు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని ప్రతి అర్హులైన లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పార్టీ నాయకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వీరేష్ బాబు నాగరాజు బూత్ కన్వీనర్ హుస్సేన్ మోదిన్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి అంటే (బివి) ఆజాత శత్రువు

**30 ఏళ్ల ప్రజాసేవలో అభివృద్ధి, అనురాగం కలగలిపి..**

**ఐదు సార్లు ఎమ్మెల్యేగా విజయం**

**ప్రజల గుండెల్లో చెరగని ముద్ర..**

**అభివృద్ధి రాజకీయాలకు మార్గదర్శి..**

**రాజకీయాల్లో అరుదైన అధ్యాయం..**

**14వ వర్ధంతి సందర్భంగా స్మరణ**

**తండ్రి బాటలో తనయుడు బివి.జయనాగేశ్వర్ రెడ్డి ప్రస్థానం**





**ఎమ్మిగనూరు,జూలై 27.అక్షరటైమ్స్:-** ఈ రోజుల్లో రాజకీయాల్లో పెరుగుతున్న విభేదాల మధ్య బి.వి.మోహన్ రెడ్డి వంటి నాయకులు అరుదు. అందుకే ఆయన జీవితం కేవలం చరిత్ర కాదు, భవిష్యత్తు తరాల నాయకులకు మార్గదర్శకం. ఆయన రాజకీయ జీవితం ఒక పాఠశాల లాంటిది. అభివృద్ధి, నిష్పాక్షికత, ప్రజలతో అనుబంధం ఈ మూడు విలువలతో ఆయన తన రాజకీయాలను నిర్మించడం విశేషం. రాజకీయాల్లో నాయకత్వం అంటే కేవలం అధికారంలో ఉండడం కాదు, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడం. ఈ నిర్వచనానికి ప్రతిరూపంగా నిలిచిన దివంగత నేత మాజీ మంత్రి బివి.మోహన్ రెడ్డి. పల్లెటూరులో పుట్టి ప్రజల కష్టాలను అర్థం చేసుకుని నాయకుడిగా ఎదిగిన అరుదైన వ్యక్తిత్వం ఆయనది. అభివృద్ధి అంటే ఏమిటో తన కార్యాచరణతో చూపించిన ఆయన, రాజకీయాల్లో "అజాత శత్రువు"గా పేరుగాంచారు. నేడు ఆయన 14వ వర్ధంతి సందర్భంగా ఎమ్మిగనూరు నియోజకవర్గంతో పాటు ఉలిందకొండలో ఆయన తనయుడు బివి.జయనాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తల నడుమ స్మారక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. 1983లో నందమూరి తారక రామారావు పిలుపుతో తెలుగుదేశం పార్టీలో అడుగుపెట్టిన ఆయన మొదటి నుంచే ప్రజా సమస్యలపై దృష్టి సారించారు. పల్లెటూరి వాతావరణంలో పెరిగిన ఆయనకు గ్రామీణ సమస్యలపై సహజ అవగాహన ఉండటం ఆయన ఎదుగుదలకు ప్రధాన కారణమైంది. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో వరుసగా ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజల నమ్మకాన్ని చాటారు. ఎన్నికల విజయాలు ఆయనకు అధికారాన్ని మాత్రమే ఇవ్వలేదదు, బాధ్యతను పెంచాయి అనడం ఇందుకు నిదర్శనం. ఎన్టీఆర్ కేబినెట్‌లో పురపాలక, రోడ్లు-భవనాలు, రవాణా శాఖల మంత్రిగా పనిచేసి ఎమ్మిగనూరు నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేసారు. తాగునీరు, రోడ్లు, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధిలో ఆయన విశేష కృషి చేశారు. ప్రతి గ్రామానికి రహదారులు, తాగునీటి సదుపాయాలు కల్పిస్తూ ప్రజల జీవన ప్రమాణాలను పెంచారు. ప్రజల సమస్యలే నా సమస్యలు అనే భావనతో ఆయన పనిచేసిన తీరు ఇప్పటికీ ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. ప్రతిపక్షం ఉన్నా వ్యక్తిగత శత్రుత్వం లేకుండా వ్యవహరించిన నాయకుడిగా ఆయన ప్రత్యేకత పొందారు. అందుకే ఆయనకు "ఆజాత శత్రువు" అనే బిరుదు దక్కింది.పార్టీ ఉపాధ్యక్షుడిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 23 జిల్లాల్లో పార్టీని బలోపేతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఎర్రకోట చెన్నకేశవరెడ్డి వంటి ప్రత్యర్థులతో పోటీలో విజయం, ఓటములు ఎదురైనా, 2004 తర్వాత వరుసగా ఓటములు చవిచూశారు.అయినా ప్రజల గుండెల్లో ఆయన స్థానం ఏమాత్రం తగ్గలేదు. 2012 జూలై 27న అనారోగ్యంతో కన్నుమూసిన, ఆయన సేవలు చిరస్థాయిగా నిలిచిపోయాయి. ఆయన మరణం ఎమ్మిగనూరు రాజకీయాల్లో ఒక ఖాళీని మిగిల్చిన, ఆయన చూపిన మార్గం ఇప్పటికీ నాయకులకు స్ఫూర్తిగా నిలుస్తోంది. తండ్రి ఆశయాలకు ప్రతినిధిగా తండ్రి తర్వాత రాజకీయ బాధ్యతలను తనయుడు బివి.జయనాగేశ్వర్ రెడ్డి భుజానికెత్తుకున్నారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ, అభివృద్ధి కార్యక్రమాల్లో చురుకుగా వ్యవహరిస్తున్నారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ, అభివృద్ధి కార్యక్రమాల్లో చురుకుగా వ్యవహరిస్తున్నారు. తెలుగుదేశం పార్టీలో చురుకుగా వ్యవహరిస్తూ ఎమ్మెల్యేగా ప్రజా సేవలో ముందుకు సాగుతున్నారు. తండ్రి చూపిన దారిలోనే అభివృద్ధి అనే లక్ష్యంతో ఆయన రాజకీయ ప్రస్థానం కొనసాగుతోంది.

# ఆహార భద్రత విషయంలో హోటళ్లను తప్పక తనిఖీ చేయాలి




**ప్రొద్దుటూరు,జూలై27.అక్షరటైమ్స్:-** పట్టణంలోని లోకాసమస్త హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇంటర్నేషనల్ లిబరేషన్ స్వచ్ఛంద సంస్థ ఫౌండర్, నేషనల్ చైర్మన్ జి.పి.నరసింహులు ఆదేశాల మేరకు రాష్ట్ర చైర్మన్ జె.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆహార భద్రత విషయంలో హోటళ్లని తప్పక తనిఖీ చేయాలని సోమవారం మునిసిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్ తో లోకాసమస్త హ్యూమన్ రైట్స్ సభ్యులు మాట్లాడుతూ పట్టణంలో రోజు రోజుకు హోటళ్లు,బేకరీలు,ఫుడ్ స్టాల్స్ సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో కొన్ని చోట్ల పరిశుభ్రత లోపాలు కనిపిస్తున్నాయని, పదార్థాలు, నాణ్యత లేని నూనెలు వినియోగిస్తున్నారని, అన్ని హోటళ్లలో శుభ్రతతో పాటు ఆహారశుభ్రతను కూడా పరిశీలించి, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తగిన చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. హోటల్లలో ఇలాంటి పరిస్థితుల కారణంగా ప్రజాఆరోగ్యానికి ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని, ముఖ్యంగా వర్షాకాలం లో అపరిశుభ్రత కారణంగా ఫుడ్ పాయిజన్,వాంతులు,విరేచనాలు వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఇందుకు ఉదాహరణగా పట్టణంలో రామేశ్వరం రోడ్డు లోని గణేష్ హోటల్ లో చట్నీలో బల్లి ఉండటం గమనించకుండా తినిన ఒక కస్టమర్ ఆస్పత్రి పాలవడం గా చెప్పవచ్చు అని తెలిపారు. కావున పట్టణంలోని అన్ని హోటళ్లు,రెస్టారెంట్లు,ఫుడ్ స్టాల్స్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి అని,ఆహార నాణ్యత పరీక్ష నిర్వహించి వినియోగిస్తున్న ముడి పదార్థాలు,నూనె,నీరు శుభ్రతను పరిశీలించాలి అని, ఫుడ్ లైసెన్స్,వంట చేసేవారి వైద్య సర్టిఫికెట్లు పరిశీలించి అలా లేని వారి పైన తగు చర్యలు తీసుకోవాలని,హోటల్ నిర్వాహకులకు ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆధ్వర్యంలో పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి అని,నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు,నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి అని తెలిపారు సవివరంగా మున్సిపల్ కమిషనర్ కు వివరించడం జరిగింది.మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్ స్పందిస్తూ వీలైనంత త్వరలో ఫుడ్ సేఫ్టీ అధికారులకు సమాచారం అందించి మున్సిపాలిటీ అధికారులతో కలిసి ప్రొద్దుటూరులోని అన్ని హోటళ్లను పరిశీలించి, ఆహారభద్రత విషయంలో జాగ్రత్త తీసుకోని వారిపైన తగు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని,ఆహార భద్రత పై అవగాహన కల్పిస్తామని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో లోకాసమస్త హ్యూమన్ రైట్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా విభాగ లీగల్ అడ్వైజర్ సి.వి.జయలక్ష్మి, రాయలసీమ జనరల్ సెక్రెటరీ వెంకట్ యాదవ్, జిల్లా వైస్ చైర్మన్ ఎన్ సుధీర్ కుమార్, జనరల్ సెక్రెటరీ పి.సత్యనారాయణ, జిల్లా మరియు నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు ఎం.వెంకట నరసింహ కుమార్, వై.ఎల్లయ్య, పి.నరసింహ,రఫీ,ముల్ల అస్మద్, మహేష్ కుమార్,గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# కమీషనర్ తో ముఖాముఖీ కార్యక్రమానికి అనూహ్య స్పందన

**ఫోన్ కాల్ ద్వారా ఒక గంటలో 26 ఫిర్యాదులు నమోదు**

**వచ్చిన ఫిర్యాదులలో పారిశుధ్యం, త్రాగునీరు, వీధి దీపాలు ప్రధాన సమస్యలుగా నమోదు**

**ఫలించిన నూతన కమీషనర్ శ్రీనివాస విశ్వనాథ్ ప్రయత్నం**





**ప్రొద్దుటూరు,జూలై 27.అక్షరటైమ్స్:-** ప్రజా సమస్యలు పరిష్కారానికి నూతన కమీషనర్ ఎంచుకున్న మార్గం 'కమీషనర్ తో ముఖాముఖీ' కార్యక్రమం విజయవంతం అయ్యింది. సోమవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫోన్ ఇన్ ప్రోగ్రాంకి ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ముఖాముఖీ కార్యక్రమం గంట వ్యవధిలోనే 26 ఫిర్యాదులు ప్రజల నుంచి ఫోన్ ద్వారా నమోదు చేసారు. నమోదు అయిన సమస్యలలో పారిశుధ్యం, త్రాగునీరు, వీధి దీపాల తదితర ప్రజా సమస్యలు అగ్రభాగంలో నిలువగా మురుగునీరు నిర్వహణ, ట్రాఫిక్, ఎంక్రోచ్మెంట్ సమస్యలు కూడా వచ్చిన ఫిర్యాదులలో ఉన్నాయి. ఫోన్ ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యాదును స్వయంగా కమీషనర్ నమోదు చేసి సత్వర పరిష్కారం కోసం ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపడం జరిగింది. ఈ సందర్భంగా కమీషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ మాట్లాడుతూ దివ్యాంగులు, వృద్ధులు, ఆరోగ్యం సరిగ్గా లేనివారు, మహిళలు, విద్యార్థులు సోమవారం జరిగే పి.జీ.ఆర్.ఎస్ కార్యక్రమాన్ని సక్రమంగా ఉపయోగించుకోవడం లేకపోవడం వలన సమస్యల పరిష్కారానికి కమీషనర్ తో ముఖాముఖీ అనే కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. దీని ద్వారా మున్సిపాలిటీ సేవలు మరింత చేరువగా ప్రజలకు అందుబాటులో రానున్నాయని అలాగే అధికారులలో జవాబుదారితనం పెరిగి పారదర్శకంగా ప్రజలకు సేవలు అందించడానికి వీలుంటుందని కమీషనర్ అన్నారు. సంబంధిత అధికారులను సమన్వయం చేసుకొని ప్రతీ సమస్యను స్వయంగా పరిష్కరించడానికి కృషి చేస్తానని కమీషనర్ అన్నారు. ప్రతీ సోమవారం రోజువారి జరిగే పి.జీ.ఆర్.ఎస్ కార్యక్రమానికి గంట ముందు ఉదయం 9 గంటల నుండి పది గంటల వరకు కమీషనర్ తో ముఖాముఖీ ఫోన్ ఇన్ కార్యక్రమం జరుగుతుందని సనస్యల పరిష్కారానికి ప్రజలు ఈ కార్యక్రమాన్ని తప్పక ఉపయోగించుకోవాలని కమీషనర్ శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ మంజునాథ్ గౌడ్, మున్సిపల్ ఇంజనీర్ ఎం. శ్రీనివాసులు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరులు యశోద, రాజేష్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ కృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ సురేంద్ర, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఎం. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పంట భీమా రైతుకు రక్షణ కవచం లాంటిది

**వాతావరణ ఆధారిత దిగుబడుల ఆధారిత పసల్ భీమా పథకం ప్రీమియం చెల్లించుటకు ఈ నెల 31**

**మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి**



**ముద్దనూరు,జూలై27.అక్షరటైమ్స్:-** మండలంలోని రైతులు ఖరీఫ్ లో సాగు చేసిన వ్యవసాయ మరియు ఉద్యాన పంటలకు ప్రీమియం డబ్బులు చెల్లించి ప్రధానమంత్రి పసల్ భీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పకృతి విపత్తులు సంభవించినప్పుడు, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అమలు చేస్తున్న పథకాన్ని ఉపయోగించుకొని లబ్ది పొందాలి అన్నారు. పంటల బీమా రైతుకు ధీమా వంటిది అన్నారు.ప్రస్తుతం ఎలినినో ప్రభావం వల్ల సకాలంలో వర్షాలు రాక పంటల దిగుబడులపైన తీవ్ర ప్రభావం పడి దిగుబడుల్లో గణనీయమైన మార్పులు వచ్చే అవకాశం ఉంది అన్నారు.

**పంటల బీమా పథకం రెండు రకాలు**

ప్రధానమంత్రి పసల్ భీమా పథకం,దిగుబడుల అంచనా బట్టి లబ్ది పొందే అవకాశం. వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం ఖరీఫ్ 2026 సంవత్సరం పంట వారిగా ప్రీమియం చెల్లించుటకు చివరి అవకాశం ఈ నెల 31 వ తేదీ అని వివరించారు. పంట రుణం పొందని రైతులు కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా ప్రీమియం చెల్లించవలెను. నమోదు చేసుకునేటప్పుడు రైతులు ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్, పట్టాదారు పాస్ బుక్, పంట ధృవీకరణ పత్రము మరియు ఆధార్ కు అనుసంధానమైన మొబైల్ నెంబర్ వివరములు జతపరచవలెనని తెలిపారు. ప్రధాన మంత్రి పసల్ భీమా క్రింద ప్రీమియం చెల్లించుటకు ఆఖరి తేదీలు వరి పంటకు - 15 ఆగస్టు 2026 వరకు కంది, జొన్న, మినుము, ఉల్లి, పసుపు - 31 జూలై 2026 వరకు చెల్లించాలన్నారు. రైతు వాటా ప్రీమియం ఎకరాకు

వరి - 85 రూపాయలు

కంది - 36 రూపాయలు

జొన్న - 38 రూపాయలు

మినుము - 38 రూపాయలు

ఉల్లి - 91 రూపాయలు

పసుపు - 182 రూపాయలు చొప్పున చెల్లించాలని కోరారు.

వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం క్రింద ప్రీమియం చెల్లించుటకు ఆఖరి తేదీ -31 జూలై 2026 వేరుశనగ, చీనీ/బత్తాయి, పత్తి, అరటి రైతు వాటా ప్రీమియం ఎకరాకు రూపాయలల్లో

వేరుశనగ - 567

చీనీ/బత్తాయి - 2782

పత్తి - 2023

అరటి - 3061 చొప్పున రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించి పంట సాగు ధ్రువీకరణ పత్రం పొంది సమీప మీ సేవా కేంద్రాల్లో గాని, కామన్ సర్వీస్ సెంటర్లో గాని,సమీప సచివాలయంలో గాని ప్రీమియం డబ్బులు చెల్లించి సంబంధిత రసీదు పత్రం పొంది జాగ్రత్తగా భద్రపరచుకోవాలి అన్నారు.



# ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలి

**ప్రొద్దుటూరు,జూలై27.అక్షరటైమ్స్:-** ప్రొద్దుటూరు పట్టణంలోని ట్రాఫిక్ నిర్వహణ, ట్రాఫిక్ సిగ్నల్స్ పనితీరు మరియు రహదారి భద్రతకు సంబంధించిన అంశాలపై మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అధ్యక్షతన సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రొద్దుటూరు ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్, ట్రాఫిక్ సబ్ ఇన్స్పెక్టర్ పాల్గొని పట్టణ ట్రాఫిక్ సమస్యలు, సిగ్నల్స్ నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు మరియు ప్రజలకు సురక్షిత రవాణా కల్పించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ ఎం. శ్రీనివాసులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ సంక్షేమం అభివృద్ధికి నిదర్శనం

**టీడీపీ పాలనలో ప్రతి ఇంటా వెలుగులు**

**45 రోజుల కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న జనం**

**కోల్మన్ పేటలో ఘనంగా ఇంటింటికీ తెలుగుదేశం**

**ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ జిల్లా వైస్ చైర్మన్ పి.మత్తురెడ్డి**





**కోసిగి,జూలై27.అక్షరటైమ్స్:-** తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండు సంవత్సరాల కాలంలో చేపట్టిన అభివృద్ధి,అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడమే లక్ష్యంగా "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. టిడిపిఅధినేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రాలయం నియోజకవర్గ ఇన్ చార్జ్ ఎన్.రాఘవేంద్ర రెడ్డి పిలుపు మేరకు మండల పరిధిలోని కోల్మన్ పేట గ్రామంలో నిర్వహించిన 45 రోజుల"ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కర్నూలు జిల్లా మాజీ వైస్ ఛైర్మన్ పి.మత్తురెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి, గత రెండేళ్లలో కూటమి/టీడీపీ ప్రభుత్వం సాధించిన ప్రగతిని,అందించిన సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా పి.మత్తురెడ్డి మాట్లాడుతూ.. సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి బాటలో రాష్ట్రం పయనిస్తోందని,పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరుతున్నాయని తెలిపారు.

**పెద్ద ఎత్తున పాల్గొన్న నాయకులు,కార్యకర్తలు:**

ఈ కార్యక్రమంలో ఆర్లబండ సొసైటీ అధ్యక్షుడు నడిగేని అయ్యన్న,మార్కెట్ యార్డ్ ఛైర్మన్ చింతలగెని నర్సారెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు G.జ్ఞానేష్,అరవిల్లి వీరేశ్, పోతుల వీరారెడ్డి, నడిగేని మదేవ పాల్గొని శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.అలాగే గ్రామీణ నాయకులు మదిరి పెద్ద వీరారెడ్డి,మదరి ఎర్ర వీరారెడ్డి, ఉప్పలపాటి అర్జున్,గుడిసె పెద్ద రామాంజనేయులు, మదిరి పెద్ద లక్ష్మయ్య,స్కూల్ ఛైర్మన్ అరవ పెద్ద లక్ష్మయ్య, మాదిరి హనుమేష్, వలకలదీన్నే రవిచంద్ర, కామన్ దొడ్డి ఉసేన్,ఉసేన్, బూత్ ఇన్ చార్జీలు గిరీ దేవేంద్ర, బదినేహాళ్ సుంకప్ప, క్యాంప్ ఇన్ చార్జ్ ముద్ద సతీష్ కుమార్,క్లస్టర్-4 పరిధిలోని గ్రామ నాయకులు,పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఊటుకూరి వీరయ్య స్కూల్ అభివృద్ధి చేసిన భూమి రెడ్డి వంశీధర్ రెడ్డి



**ప్రొద్దుటూరు,జూలై27.అక్షరటైమ్స్:-** నాడు నేడు కార్యక్రమంలో భాగంగా శ్రీ ఊటుకూరి వీరయ్య ఉన్నత పాఠశాలలో సుమారు 2 కోట్ల రూపాయలతో మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మరియు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి ఆశీస్సులతో 32వ వార్డు కౌన్సిలర్ గా ఈ స్కూల్ రూపు రేఖలు మార్చినందుకు ఎంతో గర్విస్తున్నానని మాజీ కౌన్సిలర్ భూమి రెడ్డి వంశీధర్ రెడ్డి తెలిపారు. ప్రతీ సంవత్సరం ఊటుకూరి వీరయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గురవయ్యాతోట) లో పదవ తరగతి పరీక్షల్లో మొదటి 3 స్థానాలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు నగదు పురస్కారంతో సత్కరించడం జరుగుతుందని అందులో భాగంగా గత సంవత్సరం ఆ పాఠశాలలో ఉత్తీర్ణత సాధించిన మొదటి ముగ్గురికి ఒక్కొక్కరికి 2వేల చొప్పున మొత్తం 6 వేల రూపాయలు పాఠశాలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షులు భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వంశీధర్ రెడ్డి ప్రస్తుతం 10వ తరగతి విద్యార్థులతో సమావేశమై మాట్లాడుతూ నేటి యువత దేశ భవిష్యతును నిర్ణయించే విధంగా ఉండాలని, అందులో మీ పాత్ర కూడా ఉండాలని ఆశిస్తున్నానని అన్నారు, రాబోయే 10వ తరగతి పరీక్షలలో మొదటి 3 స్థానాల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి వచ్చే సంవత్సరం కూడా ఇలాగే నగదు పురస్కారం ఇస్తామని, అందుకు ప్రతీ విద్యార్థి అంకిత భావంతో చదవాలని, విద్యార్థుల్లో నూతన ఉత్సాహన్ని నింపారు.

# అభివృద్ధి పనుల మీద దృష్టి పెట్టండి

**ప్రత్యేక అధికారి, జాయింట్ కలెక్టర్ నిధి మీనాన్**



**ప్రొద్దుటూరు,జూలై 27.అక్షరటైమ్స్:-** పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనుల మీద ద్రుష్టి పెట్టి పారిశుధ్యం, త్రాగునీటి సమస్యలపై శ్రద్ధ పెడితే ప్రజల మన్ననలు పొందచ్చుని జిల్లా కలెక్షర్ మరియు ప్రొద్దుటూరు ప్రత్యేక అధికారి నిధి మీనన్ మున్సిపల్ కమీషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ కు సూచించారు. నూతనంగా భాద్యతలు స్వీకరించిన తర్వాత ప్రొద్దుటూరు ప్రత్యేక అధికారిని మర్యాదపూర్వకంగా కలవడానికి కడప వెళ్లిన కమీషనర్ శ్రీనివాస విశ్వనాథ్ కు పలు సూచనలు చేశారు. అధికారులను, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలని సూచించారు. కమీషనర్ తో పాటు రెవిన్యూ ఇన్స్పెక్టర్ రమేష్ ఉన్నారు.

# కొత్తపల్లె లో సామాజిక శంఖారావం అధ్యయన యాత్ర




**ప్రొద్దుటూరు,జూలై27.అక్షరటైమ్స్:-** మండలం లోని కొత్తపల్లి లో సోమవారం సామాజిక శంఖారావం అధ్యయన యాత్ర నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు, పాలాజీ శేఖర్ కార్యదర్శి గుర్రం డేవిడ్ రాజ్, ఐద్వా జిల్లా కార్యదర్శి ముంతాజ్ లు కొత్తపల్లె సచివాలయం వద్ద ప్రజలను సమీకరించి నిరసన వ్యక్తం చేసి అనంతరం పంచాయతీ కార్యదర్శి హేమంత్ కుమార్ రెడ్డికి సమస్యలతో కూడిన వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ పొద్దుటూరు మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ లో అమృత నగర్ కాలనీ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు ప్రభుత్వాలు మారుతున్నాయి. రాజకీయ నాయకులు మారుతున్నారు కానీ ప్రజల కష్టాలు మాత్రం అలాగనే ఉన్నాయి. అమృత నగర్ లో సైడ్ కాలువలు, వీధిలైట్లు, సరైనా రోడ్లు లేక ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. డ్రైనేజీ కాలువలు మురికి నీరు రోడ్లమీద ఇళ్ల మధ్య వుండి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అలగే విష సర్పాలు ప్రజల మధ్య తిరుగుతున్నాయి సరైన రోడ్లు, డ్రైనేజీ, వీధి లైట్లు లేకపోవడం వల్లనే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సరైన తాగునీరు ప్రజలకు ఏర్పాటు చేయాలి. అలాగే అల్లరి మూకలు అమృత నగర్ చుట్టుపక్కల ఉంటున్నారు వారిని కట్టడి చేయాలి. అని అన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజా సమస్యల తీర్చాలని ప్రజల తరఫున డిమాండ్ చేస్తున్నాము. లేని పక్షంలో ప్రభుత్వం మీద పెద్ద ఎత్తున ప్రజల సమస్యలు తీర్చే అంతవరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల సహాయ కార్యదర్శి నోవా, సుమన్, గురమ్మ, లక్ష్మి ,సుజాత, అయేషా, తదితరులు పాల్గొన్నారు.